క్లుప్తంగా

40 బస్తాల బియ్యం పట్టివేత

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణ పరిధిలో అక్రమంగా ప్రభుత్వ బియ్యంను తరలిస్తుండుగా ఎర్రగుంట్ల పోలీసులు దాడి చేసి 40 బస్తాల బియ్యం, వాహనాన్ని పట్టుకుని కేసునమోదు చేశారు. చెన్నూరుకు చెందిన లక్ష్మీనారాయణ అనే వ్యక్తి మరో కొంతమందితో కలసి ఎర్రగుంట్ల పట్టణం పరిధిలో ప్రభుత్వ బియ్యంను సేకరించి వాటిని కడపకు తరలిస్తున్నారు. సమాచారం రావడంతో దాడి చేసి పట్టుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పరామర్శ

పెండ్లిమర్రి: మండలంలోని కోరవాండ్లపల్లె గ్రామానికి చెందిన వైఎస్ఆర్‌సీపీ నాయకుడు రామసుబ్బారెడ్డి కుటుంబాన్ని సోమవారం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పరామర్శించారు. రామసుబ్బారెడ్డి భార్య సిద్దమ్మ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. ఈ మేరకు ఎమ్మెల్యే కోరవాండ్లపల్లెకు చేరుకుని రామసుబ్బారెడ్డి కుటుంబ సభ్యులను ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు నాగమల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా మూడవ విడత పంపిణీ

ఎర్రగుంట్ల : వైఎస్సార్ ఆసరా పథకం కింద 2023 సంవత్సరానికి లబ్ధిదారులకు మూడవ విడత పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే డాక్టరు మూలె సుధీర్‌రెడ్డి , మున్సిపల్ చైర్మన్ ఎం. హర్షవర్ధన్ రెడ్డిల చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమం జరగనుందని మున్సిపల్ కమిషనర్ పి జగన్నాథ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డులో ఉన్న ఎస్వీ కల్యాణ మండపంలో జరగనుందన్నారు. ఈ కార్యక్రమానికి మెప్మా పొదుపు సంఘాల మహిళలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఈకేవైసీ తప్పనిసరి

తొండూరు : త్వరలో పీఎం కిసాన్ పథక లబ్ధి కోసం రైతులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి మధుసూదన్‌రెడ్డి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 1380మంది రైతులు ఈకేవైసీ చేయించుకున్నారని... మిగిలిన 62 మంది రైతులు బ్యాంక్‌లో ఆధార్, ఎన్‌పీసీఐ లింక్ చేయించుకోవాల్సి ఉందన్నారు. ఈకేవైసీ చేయించుకోని వారి పూర్తి జాబితా ప్రతి రైతు భరోసా కేంద్రంలో ఉందని.. ఆర్‌బీకే సిబ్బంది ఇదివరకే సమాచారాన్ని అందించారన్నారు. కావున ఆర్‌బీకేలలో ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకోవాలని.. లేకుంటే పీఎం కిసాన్ లబ్ధి చేకూరదని పేర్కొన్నారు. ఈనెలాఖరులోపు చేయించుకోవాలన్నారు.


నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వీరపునాయునిపల్లె: మండలంలోని అంకిరెడ్డిపల్లె, వెల్దుర్తి గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ రఘునాథరెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాపరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, యువ నాయకుడు నరేన్‌రామాంజులరెడ్డి హాజరు కానున్నట్లు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసిలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని వారు కోరారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు

ఎర్రగుంట్ల : మండల పరిధిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ ఎస్ సూర్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామ్మోహన్‌రెడ్డితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నీటి ఎద్దడి ఏర్పడే గ్రామాలేమీ లేవన్నారు. ఇప్పటికే అన్ని గ్రామాలలో తాగునీటి పైపులైన్‌లు వేశామన్నారు. అంతేకాక మరమ్మతులు కూడా చేస్తున్నామని చెప్పారు. గతంలో పెన్నానదికి వరదలు వచ్చినప్పుడు పరిసరగ్రామాలలో కొంత నీటి ఎద్దడి ఏర్పడిందని, ఇప్పుడు ముందుగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

వరిగడ్డి దగ్ధం



చెన్నూరు: చెన్నూరులో సోమవారం సాయంత్రం వరిగడ్డితో వెళుతున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి వరి గడ్డి కట్టలు దగ్ధమయ్యాయి. చెన్నూరుకు చెందిన రైతు చల్లబాల వీరారెడ్డి తమ పశువుల మేత కోసం మండలంలోని ఓబులంపల్లె గ్రామంలో రూ.30 వేల రూపాయలకు వరి గడ్డిని కొనుగోలు చేశాడు. దానిని ట్రాక్టరు ద్వారా తీసుకెళ్తుండగా చెన్నూరు స్టేట్ బ్యాంకు సమీపంలోకి రాగానే అక్కడ డ్రైనేజి పనుల నిమిత్తం తోలిన మట్టిని ట్రాక్టరు ఎక్కడంతో ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు వరి గడ్డికి అంటుకుని మంటలు వ్యాపించాయి. స్థానికులు కడప ఫైరింజన్‌కు సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. వరిగడ్డి పూర్తిగా కాలిపోయింది.

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

– ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



పెండ్లిమర్రిలో మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



జమ్మలమడుగులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

పెండ్లిమర్రి: డ్వాక్రా అక్కచెల్లెమ్మలను లక్షాధికారులను చేయాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పెండ్లిమర్రి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో డ్వాక్రా మహిళలకు మూడో విడత వైఎస్సార్ ఆసరా కింద 811 స్వయం సహాయ సంఘాలకు రూ.7.70 కోట్ల మెగా చెక్కు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే ఆకుటుంబం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. సీఎం వైఎస్ జగన్ మహిళలు అన్నిరంగాల్లో ముందు ఉండాలని మహిళలకు పెద్ద పీట వేశారన్నారు. గత ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని గుర్తుచేశారు. ఇంత ఆర్థిక సహాయం చేసి ఆదుకుంటున్న సీఎం జగన్‌ను గుర్తుపెట్టుకొని ఆదరించాలన్నారు. సీకే దిన్నె జెడ్పీటీసీ పి.నరేన్ రామాంజులరెడ్డి మాట్లాడారు. అనంతరం డ్వాక్రా మహిళలు సీఎం జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్ నాయక్, జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, ఎంపీపీ వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, సర్పంచ్ నాగమల్లారెడ్డి, తహశీల్దార్ ఉదయ భాస్కర్ రాజు, ఎంపీడీఓ అల్తాఫ్ హుస్సేన్, ఏరియా కో ఆర్డినేటర్ రఘునాథ్ రెడ్డి, ఏపీఎం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

హామీలు ఇచ్చి మోసం చేసిన వారిని నమ్మవద్దు

– ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు: ఎన్నో హామీలు ఇచ్చి అవి అమలు చేయకుండా మోసం చేసిన టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును నమ్మవద్దని జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో మెప్మా, డ్వాక్రా సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు మోసం చేసి మహిళలను ఆర్థిక కష్టాలలోనికి నెట్టేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ప్రజలు పడే కష్టాలను తెలుసుకుని వారిని ఆదుకోవాలనే లక్ష్యంతో అధికారంలోనికి రాగానే ప్రతిమహిళకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే వైఎస్సార్ ఆసరా పథకం కింద మహిళలకు లబ్ధి చేకూరిందన్నారు. చంద్రబాబు నాయుడు డ్వాక్రా సంఘాల మహిళలకు చేసిందేమీ లేదన్నారు. కేవలం పదివేలు మాత్రమే మాఫీ చేశాడన్నారు. మన ప్రజా నాయకుడైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి మహిళకు లక్ష రూపాయల వరకు రుణ మాఫీ చేశారన్నారు. మరోసారి అడ్డదారిలో ముఖ్యమంత్రి కావడం కోసం చంద్రబాబు ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు ఇప్పటికైనా గమనించి మంచి చేసేవారు ఎవరో గుర్తించుకోవాలన్నారు. ఎన్ని కష్టాలున్నా ప్రజలకు సంక్షేమ పథకాల అమలులో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎక్కడా రాజీ పడలేదన్నారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, ఎంపీపీ హారిత, మున్సిపల్ వైస్ చైర్మన్లు రామలక్షుమ్మ, సింగరయ్య, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు లక్ష్మీదేవి ప్రసంగించారు.

సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం



సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న డ్వాక్రా సంఘాల మహిళలు

వేంపల్లె : మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, ఏపీఐఐసీ రాష్ట్ర డైరెక్టర్ చంద్ర ఓబుళరెడ్డి, సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు, ఎంపీపీ లక్ష్మీగాయత్రి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎస్ఎస్ఆర్ కళ్యాణ మండపంలో మూడవ విడత వైఎస్సార్ ఆసరా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల అభ్యున్నతికి పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. చట్ట సభలలో, మంత్రి వర్గంలో, సముచిత స్థానం కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు మాత్రమే దక్కిందన్నారు. వైఎస్సార్ ఆసకా పథకం కింద మండల వ్యాప్తంగా 986డ్వాక్రా సంఘాలకు గానూ 9860మంది అక్కాచెల్లెమ్మలకు రూ.10.50కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులకు వారు మెగా చెక్కును అందించారు. అనంతరం డ్వాక్రా సంఘాల మహిళలు సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు.

– కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్లు బాలాజి రాజు, పురుషోత్తమరెడ్డి, ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి, ఏపీఎం బాలస్వామి, పశువైద్య డాక్టర్ షాదిక్ బాషా, మండల ఉపాధ్యక్షుడు బాబా షరీఫ్, ఎంపీటీసీలు కటిక చంద్రశేఖర్, మణిగోపాల్ రెడ్డి, ప్రదీప్‌కుమార్‌రెడ్డి, హబీబుల్లా, భారతి, రాజ్‌కుమార్, సర్పంచ్ చలపతి, నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

వేంపల్లె : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర పేర్కొన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ ఓబుళరెడ్డి ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పట్టణంలోని హరిజనవాడ ప్రాంతంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హరిజనవాడ ప్రాంతంలో పేరుకపోయిన చెత్తా చెదారం, వ్యర్థాలను తొలగించారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి సామాజిక విషయాలపట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. అంతేకాకుండా పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పీడీ, విద్యార్థులు పాల్గొన్నారు.

భూమి పూజ



కళ్యాణమండపం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఆలయాల పాలకమండలి బృందం

చక్రాయపేట: చక్రాయపేటలోని శ్రీవేంకటేశ్వర రాచరాయ స్వామి ఆలయాల ప్రాంగణంలో నూతన కళ్యాణ మండపం నిర్మాణానికి సోమవారం భూమిపూజ నిర్వహించారు. కళ్యాణమండపం నిర్మాణానికి ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, పాడా ఓఎస్డీ అనిల్ కుమార్ రెడ్డిలు రు.54 లక్షలు పాడా నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో కళ్యాణ మండపం నిర్మాణం కోసం ఆలయ అర్చకులు అనంత పద్మనాభ శర్మచే పూజలు చేయించి చైర్మన్ మోపూరు రామాంజనేయరెడ్డి, మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డిల చేతుల మీదుగా భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల సమన్వయకర్త ఓబుళరెడ్డి, ఎంపీపీ మాధవీ బాలకృష్ణ, మాజీ చైర్మన్‌లు ఓబుళరెడ్డి, హరనాథరెడ్డి, వైస్ చైర్మన్ నాగభూషణం, సభ్యులు శ్రీరామమూర్తి, రంగా రెడ్డి, శ్రీనివాసులు, మునిరత్నం రెడ్డి, తిరుమల రెడ్డి, రామచంద్రా రెడ్డి, గండి పాలక మండలి సభ్యుడు రామాంజులరెడ్డి పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

వేముల : మండల పరిధిలోని వేల్పుల గ్రామ పంచాయతీ పరిధిలోని బెస్తవారిపల్లె గ్రామంలో సోమవారం లయోలా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ బృందం చేపట్టిన పరిసరాల పరిశుభ్రత – వ్యాధుల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ అమల్‌రాజ్ హాజరై మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రజలకు వ్యాధుల నిర్మూలన, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. అలాగే బాలయోగి గురుకుల పాఠశాల విద్యార్థులతో కలిసి బెస్తవారిపల్లె గ్రామ వీధులలో తిరుగుతూ ప్రజలలో చైతన్యం కలిగించేలా కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు లింగాల రామలింగారెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఆంటోని పాల్, అధ్యాపకులు నరేంద్రకుమార్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్ శంకరయ్య పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, తదితరులు

చెన్నూరు : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని శివాల్‌పల్లె గ్రామ పంచాయతీలో రూ.57లక్షల (ఏపీపీఆర్) నిధులతో శివాల్‌పల్లె హరిజనవాడ నుండి శివాల్‌పల్లె మెయిన్ రోడ్డు వరకు సిమెంటు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి ఆయన తనయుడు, చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజనేయరెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి మాట్లాడుతూ కమలాపురం నియోజకవర్గంలో 19వర్క్ ప్యాకేజీల కింద కోట్ల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. చెన్నూరు మండలంలో ఈ నిధుల ద్వారా రెండు పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పటికే మండలంలోని బలిసింగాయపల్లెలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, ఉప సర్పంచ్ రామసుబ్బారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఆర్ఎస్ఆర్ (చిన్నా), నాయకులు పుల్లయ్య యాదవ్, జెడ్పీటీసీ దిలీప్‌రెడ్డి, ఎంపీపీ సురేష్ యాదవ్, అటవీ శాఖ రాష్ట్ర డైరెక్టర్ శ్రీలక్ష్మి, కొండపేట సర్పంచ్ చంద్రశేఖర యాదవ్, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ఎంపీటీసీలు సుబ్బారెడ్డి, నాగిరెడ్డి, రఘురామిరెడ్డి, నిరంజన్‌రెడ్డి, అశ్రత్, వారీస్, శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మున్సిపాలిటీకి రూ.39 లక్షలు ఆదాయం



వేలంపాటలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తదితరులు

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీకి సంబంధించిన కూరగాయల మార్కెట్, వాహనాల పార్కింగ్, జంతువధశాలలకు సోమవారం వేలం పాట నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి అధ్యక్షతన మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్‌ల ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించగా కూరగాయల మార్కెట్‌కు సంబంధించి రూ.52.30 లక్షలు సర్కారువారి పాట నిర్వహించారు. అందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వాయిదా వేశారు. అయితే వాహనాల పార్కింగ్ రూ.36.03లక్షలకు రవీంద్రారెడ్డి వేలం పాట ద్వారా దక్కించుకున్నారు. జంతువధశాలను రూ.3.24లక్షలకు రామమునిరెడ్డి వేలం ద్వారా దక్కించుకున్నారు. దీంతో మున్సిపాలిటీకి రూ.39 లక్షలు ఆదాయం చేకూరింది.

సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికి వెలుగు

ఎర్రగుంట్ల : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలల వల్ల ప్రతి ఇంటికి లబ్ధి చేకూరి ఆ ఇంటిలో వెలుగు నెలకొందని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టరు ఎం సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం నిడుజివ్వి గ్రామంలో ప్రజాదర్బార్‌లో జమ్మలమడుగు నియోజకవర్గ పార్టీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందుతున్నాయని అన్నారు. వలంటీర్ వ్యవస్థను, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి ఇంటి ముంగిటికే పథకాలు అందించే ఏర్పాటు చేశారన్నారు.

ఆన్‌లైన్ మాయాజాలాన్ని అడ్డుకోవాలి

వీరపునాయునిపల్లె: మండలంలోని అనిమెల, లింగాల రెవెన్యూ పరిధిలో జరిగిన ఆన్‌లైన్ మాయాజాలాన్ని నిలిపివేయాలని రెండు గ్రామాల సర్పంచులు నరేష్‌రెడ్డి, పుల్లమ్మ సోమవారం తహసీల్దార్ ఉమాభారతికి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ.. అనిమెల రెవెన్యూ పరిధిలోని బోగాదమ్మ ఆలయానికి చెందిన భూమి సర్వే నంబరు 1026లో 5 ఎకరాల భూమిని గంగిరెడ్డిపల్లెకు చెందిన పోచం రెడ్డి రామాంజనేయరెడ్డి అక్రమంగా ఆన్‌లైన్లో ఎక్కించుకొని కొన్నేళ్లుగా బ్యాంకు లోను పొందుతున్నారని.. అంతేకాకుండా లింగాల గ్రామంలో102–1 4.50 ఎకరాలు డీకేటి పట్టా పొంది సాగు చేయకుండా రుణాలు, ఇన్సూరెన్సులు పొందుతున్నాడన్నారు.

సదరు భూమి లింగాలకు చెందిన ఎస్సీ కాలనీ వాసుల అనుభవంలో ఉన్నాయని గతంలో పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ సమస్య పరిష్కరించాలని కోరామన్నారు.

ఆధ్యాత్మికతే క్రమశిక్షణకు మూలం



సరస్వతి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చింతకొమ్మదిన్నె: ఆధ్యాత్మికతే క్రమశిక్షణకు మూలం అని కడప ఆర్డీఓ ధర్మా చంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కొలుములపల్లి ఉన్నత పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మికత మంచి క్రమ శిక్షణ నేర్పుతుందన్నారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ పీఓ అంబవరం ప్రభాకర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్ రెడ్డి, ఎంపీడీఓ రవికుమార్ రెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విభేదాలు సృష్టించడం తగదు

– మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్



మీడియాతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, తదితరులు

పులివెందుల టౌన్ : కొంత మంది రాజకీయ స్వార్థపరులు విభేదాలు రేపి రెచ్చగొట్టాలని చూస్తున్నారని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డి, శ్రీరంగనాథస్వామి ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, మాజీ చైర్మన్ యార్వ వెంకటసుబ్బయ్యలతో కలసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూరగాయల మార్కెట్‌పై నిజాలు తెలుసుకుని ధర్నాలు చేస్తే బాగుంటుందన్నారు. పులివెందుల కూరగాయల మార్కెట్ నామకరణంపై రాజకీయ రంగు పులుముతున్నారని.. తమ మనుగడ కోసం కొద్దిరోజులుగా రంగనాథస్వామి ఆలయం వద్ద ఉన్న కూరగాయల మార్కెట్‌పై లేనిపోని అపోహలు సృష్టించి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు హిందు ఐక్యవేదిక పేరుతో టీడీపీ, బీజేపీ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడి లేనిపోనివి సృష్టిస్తున్నారన్నారు. పట్టణంలోని పడమటి ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో వారపు సంత ఉండేదని.. పులివెందుల అభివృద్ధిలో భాగంగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ 2008లో రూ.30కోట్ల నిధులతో రంగనాథస్వామి ఆలయ సమీపంలో కూరగాయల మార్కెట్ యార్డు నిర్మించారన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక.. మార్కెట్ అభివృద్ధికి రూ.1.50 కోట్ల నిధులు ఇచ్చారన్నారు. మార్కెట్‌లో కూరగాయలు అమ్ముకునే ప్రతి ఒక్కరూ వైఎస్సార్ పేరు పెట్టాలని కమిషనర్‌కు వినతి పత్రం ఇవ్వడంతో వారి కోరిక మేరకు వైఎస్సార్ కూరగాయల మార్కెట్ అని పేరు పెట్టామన్నారు. టీడీపీ నాయకులు రాంగోపాల్‌రెడ్డి ఎమ్మెల్సీగా ప్రమాణం స్వీకారం చేయకముందే మా ప్రభుత్వం వస్తే రంగనాథస్వామి కూరగాయ మార్కెట్ అని పేరు పెడతామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అభివృద్ధికి సహకరించాలి తప్ప రెచ్చగొట్టే మాటలు మానుకోవాలని వారు హితవు పలికారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కిషోర్, విజయకుమార్‌నాయుడు, కో.ఆప్షన్ దాసరి చంద్రమౌళి, నాయకులు చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ముద్దనూరు సీఐగా నరేష్‌బాబు

ముద్దనూరు: స్థానిక అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నరేష్ బాబు సోమవా రం బాధ్యతలు చేప ట్టారు. నంద్యాలలో ట్రాఫిక్ సీఐగా విధు లు నిర్వహిస్తున్న నరేష్‌బాబు బదిలీలో భాగంగా ముద్దనూరు సీఐగా విధుల్లో చేరారు. అనంతరం సీఐ నరేష్ బాబు స్థానిక ఎస్ఐ చంద్రమోహన్ ఇతర సిబ్బందితో చర్చించారు. నెలన్నర క్రితం అప్పటి సీఐ మోహన్‌రెడ్డి కర్నూలుకు బదిలీపై వెళ్లారు.

దోమల నియంత్రణతో వ్యాధులు దూరం

వేముల : దోమలు వ్యాప్తి చెందకుండా నియంత్రణా చర్యలు చేపట్టినట్లు మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య పేర్కొన్నారు. మండల కేంద్రమైన వేములలో సోమవారం ఫీవర్, లార్వా సర్వేలు నిర్వహించి నిల్వ ఉన్న నీటి తొట్లల్లో అబైట్ ద్రావణాన్ని పిచికారి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని, జ్వరాలు వచ్చినట్లయితే వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శారదమ్మ, ఆరోగ్య కార్యకర్త అశ్వని, ఆశా కార్యకర్త శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల సమయంలో సమయస్ఫూర్తి ప్రదర్శించాలి

జమ్మలమడుగు రూరల్: ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు సమయస్ఫూర్తి ప్రదర్శించాలని నెహ్రూ యువకేంద్రం జిల్లా కో ఆర్డినేటర్ మణికంఠ పేర్కొన్నారు. సోమవారం జమ్మలమడుగు ఆర్డీఓ కార్యాలయ సభా భవనంలో నేషనల్ డిజాస్టర్ రెస్పాన్‌ఫోర్స్ ఆధ్వర్యంలో ప్రజలకు ఎఎన్ఎంలకు, సిబ్బందికి ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు సీపీఆర్ చేసే విధానాన్ని తెలుసుకోవాలని సూచించారు. అనంతరం డెమో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ జి.శ్రీనివాసులు, తహశీల్దార్ రమేష్, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ కమాండర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మేళాకు సిద్ధం చేయండి



మాట్లాడుతున్న స్పెషలాఫీసర్ మల్లికార్జున

లింగాల : జగనన్న కాలనీలలో ఇళ్లు పూర్తయిన పక్కాగృహాలకు హౌసింగ్ కంప్లిషన్ మేళాకు సిద్ధం చేయాలని మండల స్పెషలాఫీసర్ మల్లికార్జున పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలస్థాయి అధికారుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తయిన పక్కాగృహాలకు మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. పూర్తికాని పక్కాగృహాలను జూన్ 30వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. మనకు విధించిన టార్గెట్ ప్రకారం పక్కాగృహాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఆయుర్వేద మందుల ద్వారా కరోనాకు మందులు పంపిణీ చేసి ప్రజలను కాపాడిన వీఆర్ఓ రామగంగాధరరెడ్డి యాదవ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేంద్రనాథ్, తహసీల్దార్ శేషారెడ్డి, అన్ని సచివాలయాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లి హుండీ ఆదాయం రూ.3.75 లక్షలు



చింతకొమ్మదిన్నె: మండలంలోని కొత్తపేట–బుగ్గలేటిపల్లె సమీపంలోని గంగమ్మ తల్లి ఆలయ హుండీ ఆదాయం రూ.3.75 లక్షలు వచ్చినట్లు ఆలయ ఈవో పి. సురేష్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆలయ ఆవరణంలో ఆలయ పర్యవేక్షణ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఇందులో జాతర, ఐదు వారాల జాతరతో పాటు ఆదాయాన్ని లెక్కించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ విశ్వనాథరెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

కరపత్రాల విడుదల

జమ్మలమడుగు: ఏప్రిల్ 5వ తేదీ చలో ఢిల్లీ కార్మిక , కర్షక పోరాట ప్రదర్శనను విజయవంతం చేయాలని సీఐటీయు , అంగన్వాడీ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మీ, దాసరివిజయ్‌లు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు విపరీతంగా పెంచుకుంటూ పోతోందన్నారు. అధిక ధరలకు అడ్డుకట్ట వేయడంతోపాటు గ్యాస్, పెట్రోల్ డీజిల్ ధరలను గణనీయంగా తగ్గించాలని వారు డిమాండ్ చేశారు.

రికార్డుల పరిశీలన

వేంపల్లె : వేంపల్లె పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు లిప్ కార్యక్రమంపై సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లిప్ మానటరింగ్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా లిప్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని.. ఉపాధ్యాయులు కూడా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం ఆయన రికార్డులను పరిశీలించారు.